
# మసక

సాహిత్య ప్రకాష్




"ఏరా శీనూ! మీ పక్కింటావిడ పార్వతి నీతో తెగ మాట్లాడేస్తుంటుంది. ఏంటీ సంగతి..." అడిగాడు తన ఫ్రెండ్ శ్రీనివాస్‌ని...

"నీకెప్పుడు అవే సంగతులేగా కావాల్సింది...!" మండిపడ్డాడు శీను.

"సర్లేవోయ్.. ఈరోజు కాకపోయినా రేపయినా తెలుస్తుంది. పెద్ద హీరోలా పోజు కొట్టకు..." దెప్పిపొడుస్తున్నట్లుగా అన్నాడు రాజు.

"అదేం కాదురా...నీనోట్లో నువ్వు గింజవేసినా నానదని భయపడుతున్నాను. పార్వతికూడా నేనంటే చాలా ఇష్టం...నన్నెంతో ప్రేమగా చూసుకొంటుంది. భర్త లేనప్పుడు నాకిష్టమైనవన్నీ వండి వడ్డిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే మాది జన్మ జన్మల అనుబంధం" అన్నాడు.

"మరీ అంతలా ఫీలవ్వమాక... ఎందుకైనా మంచిది జాగర్త...''

"నన్నేం చేయమంటావ్‌రా...నన్ను చూడందే ఆమె ఒక్క క్షణం కూడా ఉండలేదు. పనేమీ లేకపోయినా ఇంటికొచ్చి ముచ్చట్లాడుతుంది. నన్ను కూడా వాళ్లింటికి రమ్మని చెప్పి రాత్రింబవళ్లు...అబ్బా..చెప్పడం నా వల్ల కావడం లేదు...''

"అలాగా...?!'' కళ్లింత చేస్తూ అన్నాడు రాజు.

"అవున్రా...స్వర్గ సుఖాలన్నీ అక్కడే, ఆమె సమక్షంలోనే టేస్ట్ చేస్తున్నాననుకో...'' కించిత్ గర్వంగా ఫీలయ్యాడు శీను.

"అయినా ఆవిడకిదేం పొయ్యేకాలం... మంచి భర్త, చక్కటిపిల్లల్ని పెట్టుకుని...''

"మంచి భర్తే.. ఏంలాభం.. ఆ విషయంలో నాకు వందకి రెండొందల మార్కులేస్తుందనుకో...''

"నిజంగా''

"అబ్బా... నీకంతా వేళాకోళమే గానీ..అద్సరే ఏంటీ విశేషాలు..!''

"ఏముంటాయి మా దగ్గర విశేషాలు. అలాంటివేవో నువ్వే చెప్పాలి..''

"ఆc..మొన్నా మధ్య మీ ఇంటికి వచ్చినప్పుడు మీ ఎదురింట్లో ఉన్న ఓ మెరుపుతీగ నాకు సెకండ్ లుక్కిచ్చి స్మైల్ కూడా చేసిందిరా...నేనేమో ఈ ఆంటీ దగ్గర ఆల్రెడీ ఎంగేజ్డ్..అవున్రా...నువ్వో చూపు చూడకపోయావా...!''

"ఎవరూ మా ఎదురింటి శిల్పనా...ఛ.ఛ.. ఆ అమ్మాయి అలాంటిదేం కాదు. మంచిది.. ఏదో పొరపాట్న వెనక్కి తిరిగి చూసుంటుంది. నువ్వు కాస్త దాన్ని సెకండ్ లుక్ అనుకొని తెగ ఫీలైపోతున్నట్టున్నావ్...''

"అబ్బా.. ఎంత మీ ఎదురింటి అమ్మాయయితే మాత్రం వెనకేసుకురావడమే!?''

"ఏడిశావ్ గానీ... శిల్పని గురించి మరోసారి కామెంట్ చేస్తే బాగోదు...''

"ఏంటీ! రాజావారికి కోపం వచ్చినట్టుందే... సారీ..''

"సర్లే...నాకర్జంటు పనుంది మళ్లీ కలుస్తాను..'' వెళ్లిపోయాడు రాజు...

***

"అదేంటోరా రమణా! మా వీధిలో అంతమంది మగాళ్లున్నా ఆడాళ్లందరూ నన్నే పిచ్చి పిచ్చిగా ఇష్టపడుతుంటారు. నేను మరీ అంత గ్లామరస్‌గా ఉంటానా..'' అడిగాడు శీను.

"అంత సీన్ లేదు. కానీ ఏదో ఓ మోస్తరుగా ఉంటావ్‌లే...''

"ఓమోస్తరుగా అంటే ఏంటి నీ ఉద్దేశ్యం...నీకో విషయం తెలుసా?! మావీధిలో అయిదుగురు అమ్మాయిలకి నా మీసకట్టు అంటే క్రేజ్.. మరో అయిదుగురు ఆంటీలకి నా లుక్ చూస్తే చాలు కిక్ ఎక్కుతోందట... మొన్ననే ఓ కొత్త జంట మా ఇంటికి నాలుగిళ్లవతల ఉన్న ఓ ఇంట్లో అద్దెకి దిగారు. ఆ అమ్మాయి అప్పుడే గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చింది. అబ్బబ్బా... చస్తున్నాననుకో ఈ ఆడాళ్లతో...''

"పాపం..!'' అన్నాడు రమణ.

"అవునూ..నీకు మా పక్కింటి పార్వతి తెలుసుగా...!''

" ఊc..తెలుసు...!''

"వాళ్లాయనకి రోజు నైట్‌డ్యూటీ అట...దాంతో మాక్కూడా ఈరోజు డ్యూటీ ఫిక్సయ్యింది. అక్కడికే వెళ్లాలి...ఆలస్యం చేస్తే అలిగి కూర్చుంటుంది. వెళ్లొస్తాను..బాయ్...''

***

"ఏంట్రా శీనూ! చూస్తుంటే ఏదో బాధలో ఉన్నట్లున్నావ్.. ఈజ్ దేర్ ఎనీ ప్రాబ్లమ్..?'' అడిగాడు మోహన్..

"ఆడ కత్తెరలో పోక చెక్కలా ఇరుక్కుపోయాన్రా... మహాలక్ష్మీమో మ్యాట్నీకెళ్దామంటుంది. పూజితేమో ఫస్ట్ షో కెళ్దామంటుంది. రేవతి రెండో ఆటకంటుంది. ఇక పార్వతి అయితే సరేసరి...''

"పార్వతి అంటే...?''

"ఏంట్రా ఆ కొశ్చన్‌మార్క్ ఫేసూ నువ్వూను.. ఆ రాజుగాడు చెప్పలేదా... పోనీ రమణైనా చెప్పుండాలే...''

"ఏమని...!?'' అర్థంకానట్లుగా అడిగాడు మోహన్.

"అదే.. మా పక్కింటి పార్వతికీ, నాకూ తకథింథోం సాగుతోందని...''

"అంటే...!?''

"ఏంట్రా ఆశ్చర్యార్థకాలూ ప్రశ్నార్థకాలూ...!''

**"ఆడకత్తెరలో పోక చెక్కలా ఇరుక్కుపోయాన్రా... మహాలక్ష్మీమో మ్యాట్నీకెళ్దామంటుంది. పూజితేమో ఫస్ట్ షో కెళ్దామంటుంది. రేవతి రెండో ఆటకంటుంది. ఇక పార్వతి అయితే సరేసరి...''**

పార్వతంటే..నేనంటే పడిచచ్చేది. మావీధి మొత్తంలో పర్‌ఫెక్ట్ మగాడ్ని నేనొక్కడినేనంటూ మెచ్చేది...''

"ఆc... ఇప్పుడేదో అర్జంటుగా మాట్లాడాలి రమ్మంది... వెళ్లొస్తాను..''

***

శీనుకి రోడ్డు యాక్సిడెంట్‌లో తీవ్ర గాయాలై హాస్పిటల్‌లో అడ్మిట్ అయ్యాడని రాజు, రమణ, మోహన్‌లకి తెలిసి హడావిడిగా హాస్పిటల్‌కి పరిగెట్టారు. శీను ఇంటెన్సివ్ కేర్‌లో నిస్త్రాణగా పడున్నాడు. విషయం అడిగిన మోహన్‌తో ఆబిడ్స్ సర్కిల్‌లో ఏదో ఆటో వచ్చి స్కూటర్‌పై వస్తోన్న శీనుని ఢీకొందని పార్వతి భర్త కనకయ్య చెప్పాడు.

ఆ మాటలు వినగానే ఆ ముగ్గురికీ ఓ విషయం అర్థమయ్యింది.

అర్జంటుగా తనకో సిల్క్ నైటీ కావాలని పార్వతి కోరితే తీసుకురావడానికి ఆబిడ్స్‌కి వెళ్తున్నట్లుగా వాళ్లతో శీను చెప్పిన మాటలు గుర్తొచ్చాయి.

"ఎంత మోజుపడితే మాత్రం సమయం సందర్భం లేకుండా నీకు కానుకలు కావాల్సొచ్చాయా!'' ఆవేశంగా పార్వతిని నిలదీశాడు రాజు.

"చేసిందంతా చేసి మళ్లీ నంగనాచిలా ఎలా దొంగ ఏడుపు నటిస్తోందో!'' అసహ్యించుకున్నాడు రమణ.

"మా వాడ్ని పర్‌ఫెక్ట్ మగాడివంటూ రెచ్చగొట్టి మరీ నీ కోర్కెల్ని తీర్చుకున్నావ్...'' ఆవేశంగా గద్దించాడు మోహన్.

వాళ్ల మాటలు అర్థంకాక ప్రతిమలా నిలబడింది పార్వతి.

"రేయ్.. ఏం కూశార్రా...నా పెళ్లాన్ని అంతలేసి మాటలంటారా...మిమ్మల్ని...'' అంటూ వాళ్లమీదకి రాబోయాడు కనకయ్య.

"ఆగండి... వాళ్లనేం చేయకండి..'' వారిస్తున్నట్లుగా అంది పార్వతి.

"ఆc..నీ మగతనం మా మీద కాదు.. నీ పెళ్లాం మీద చూపించు. పెళ్లికాని మా శీను గాడ్ని మరిగి.. అంటూ ఇంకా ఏదో అనబోయాడు మోహన్.

చాచి లెంపకాయ కొట్టింది పార్వతి.

బిత్తరపోయాడు మోహన్. మోహనే కాదు రాజు, రమణలు కూడా.

"మా ఇద్దరి మధ్య ఉన్న అనుబంధాన్ని ఇంత నీచంగా ఊహిస్తారా... అర్థంలేని అక్రమ సంబంధాన్ని అంటగడతారా... నా కంటే అయిదారేళ్లు చిన్నవాడైన శీనుని నేను మరిగానా...నా కోర్కెల్ని తీర్చుకోవడానికి నేనతణ్ణి వాడుకున్నానా... బరితెగించానా... చెప్పండి.. ఏ ఆధారంతో మాకు అలాంటి సంబంధం అంటగట్టారు...! ఏ సినిమా హాల్లోనో, ఏ పార్క్‌లోనో చెట్టాపట్టాలేసుకొని తిరుగుతూ కన్పించామా..!? పచ్చకామెర్లు వచ్చినవాడికి లోకమంతా పచ్చగానే కన్పిస్తుందట..'' అంటూ తన్నుకొచ్చిన దుఃఖాన్ని పంటికింద నొక్కిపట్టి అక్కడ్నుంచి పరిగెత్తుకుంటూ కెళ్లింది పార్వతి.ఆ స్నేహత్రయం మాత్రం నివ్వెరపాటుకి లోనయ్యారు.

"చూడండీ... మీరు పార్వతిని అపార్థం చేసుకున్నారు. తనకి శీను లాంటి ఓ తమ్ముడున్నాడు. వాడు దేశంకాని దేశంలో ఉద్యోగం చేస్తున్నాడు. శీనులో వాణ్ణి చూసుకుంటోంది. వాళ్లిద్దరి మధ్యా అక్కాతమ్ముళ్ల అనుబంధమే తప్ప...అక్రమ సంబంధమేమీ లేదు. మీకింకా నమ్మకం కలగకపోతే ఈ లెటర్ని చూడండి... ఫారిన్‌లో ఉన్న తన తమ్ముడు కిరణ్‌కి శీను గురించి ఏం రాసుంటుందో! పొద్దున ఈ లెటర్ని పోస్ట్ చేయమని నాకిచ్చింది. మరిచిపోయాను.'' అంటూ ఆ కవర్ని చించి మరీ వాళ్లకందించాడు కనకయ్య...

ఆ ముగ్గురి కళ్లూ అక్షరాల వెంట పరుగుదీశాయి.

"చిరంజీవి తమ్ముడు కిరణ్‌కి!

మీ అక్క పార్వతి ఆశీర్వదిస్తూ రాయునది. భగవంతుడు నీ రూపంలో నాకిక్కడ ప్రసాదించిన తమ్ముడు శీను బావున్నాడు. నీలాగే ఎప్పుడూ అల్లరీ, మారాం చేస్తుంటాడు. శీనుకి కూడా నీలాగే కాకరకాయ వేపుడన్నా ములక్కాడ పులుసన్నా చాలా ఇష్టం. రాఖీ పండక్కి మీ ఇద్దరికోసమని రెండు వెండి రాఖీల్ని వెరైటీగా చేయించాను. నీకూ పంపుతాన్లే.. శీను మీద ఉడుక్కోకు..''

ఆ లెటర్ చదివి ముగ్గురూ రెండు క్షణాలు నిర్వేదంతో మూగబోయారు. అంతవరకూ భావరహితంగా ఉన్న కళ్లు–

వరద గోదారులయ్యాయి.

కాళ్లు పార్వతి ఇంటివైపునకు పరుగు తీశాయి.

మరుక్షణం పార్వతి పాదాల చెంత పసిపాపల్లా ఉన్నారు.

★